సాక్షి ఒడిశా

శుక్రవారం । 9 । జూన్ । 2023



హక్కులపై అవగాహన శిబిరం

జయపురం: బాలలకు చట్టరీత్యా సంక్రమించే హక్కులపై కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రధీకరణ ఆధ్వర్యంలో గురువారం అవగాహన శిబిరం నిర్వహించారు. పోక్సో చట్టం, నిర్బంధ విద్య, బాలకార్మిక వ్యవస్థ తదితర వాటిపై వివరించారు.



కెనాల్ రోడ్డు నిర్మాణంపై దర్యాప్తు చేపట్టాలి

- 8లో▸



రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ మృతి

- 8లో▸

న్యూస్‌రీల్

భార్యకు నివాళులర్పించిన నవరంగపూర్ ఎంపీ



పిల్లలతో కలిసి భార్య తపసికి నివాళులర్పిస్తున్న ఎంపీ రమేష్‌చంద్ర మాఝి

కొరాపుట్: అనారోగ్యంతో ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందిన భార్యకు నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి నివాళులర్పించారు. ఈ మేరకు గురువారం తన క్వార్టర్స్‌లో సంతాప కార్యక్రమం నిర్వహించారు. రమేష్ 2015లో రాష్ట్ర ఐటీశాఖ మంత్రిగా రాష్ట్ర పర్యటనలో ఉన్న సమయంలో ఆయన భార్య తపసి మాఝి అస్వస్థతకు గురైనా, సమాచారం లేక పోయింది. కుటుంబ సభ్యులు ఆమెను భువనేశ్వర్ ఆస్పత్రికి తరలించేసరికి పరిస్థితి విషమించింది. రమేష్ భువనేశ్వర్ వెళ్లేందుకు మార్గాలు కూడా అనుకూలించ లేదు. విషయం తెలుసుకున్న సీఎం నవీన్ పట్నాయక్.. ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి తపసిని ఉన్నత చికిత్స నిమిత్తం ఢిల్లీకి పంపిచారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమె అక్కడే తుదిశ్వాస విడిచారు. అప్పటి నుంచి రమేష్ మరో వివాహం చేసుకోకుండా పిల్లలను జాగ్రత్తగా చూస్తున్నారు. గురువారం 8వ వర్థంతి సందర్భంగా జొరిగాం నియోజకవర్గంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన రక్తదానం, అన్నదానం, వస్త్రదానాలు నిర్వహించారు.


రాణిపేటలో మహిళలకు శిక్షణ శిబిరం



ఎంబ్రాయిడరీపై శిక్షణ అందిస్తున్న నాబార్డు సిబ్బంది

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ రాణిపేట గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉన్నతికి శిక్షణా శిబిరాన్ని(ఎంఈడీపీ) నాబార్డు లీడ్ బ్యాంకు మేనేజర్ మహేశ్వర మండల్ గురువారం ప్రారంభించారు. శిబిరంలో కుట్టుపని, మగ్గం, ఎంబ్రాయిడరీ నేర్చుకునేందుకు 30మంది ఆసక్తి చూపించారు. వీరికి భువనేశ్వర్‌కు చెందిన నాబార్డు శిక్షకులు ప్రతీక్ పండా తర్ఫీదు అందించనున్నారు. మహిళలు దీనిని వినియోగించుకొని, ఇంటి వద్దే ఆర్థికంగా ఉపాధి పొందవచ్చని ఎల్‌డీఎం సూచించారు. శిబిరంలో గాడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సునీల్ పాత్రొ, కార్యకర్తలు పర్యవేక్షించారు.

రైతులకు సేంద్రియ విత్తనాలు పంపిణీ



రైతులకు సేంద్రియ వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దాస్

రాయగడ: పట్టణంలోని ఆర్గానిక్ ప్రొడ్యూసర్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కాసీపూర్ సమితి శంకరడ పంచాయతీలో రైతులకు సేంద్రియ ఎరువులను గురువారం పంపిణీ చేశారు. భారతీయ ప్రకృతిక కృషి పద్ధతి(బీపీకేపీ)లో అంతర్భాగమైన ఈ కార్యక్రమానికి అగ్రగామి స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ అచ్యుత్ దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ సామాజిక కార్యకర్త సుమన్ జొడియాణి, ఘొసేయి జొడియాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 గ్రామాలు చెందిన 400మంది రైతులకు 7రకాల సేంద్రియ వరి విత్తనాలను ఉచితంగా అందజేశారు. అనంతరం అచ్యుత్ దాస్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, విత్తనాల వినియోగం వల్ల అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ధాన్యం పండించవచ్చని తెలిపారు. అయితే రైతుల్లో అవగాహన లోపం వల్ల అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు వినియోగించడంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏఓ పంచానన్ బెహరా, అగ్రగామి సంస్థ కన్వీనర్ ప్రమోద్‌కుమార్ పండా తదితరులు ప్రసంగించారు.

జిల్లాకు వరాల జల్లు

- ముగిసిన 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ పర్యటన
- కాసీపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు హామీ
- రూ.1200 కోట్లతో జయపురం–బరంపురం ఎక్స్‌ప్రెస్ హైవే
- డొంగిరియాల ఆర్థికాభివృద్ధికి మరిన్ని నిధులు



స్వాగతం పలికేందుకు వేచి ఉన్న ఎస్‌హెచ్‌జీ మహిళలు



పర్వత ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తున్న వీకే పాండ్యన్

రాయగడ: గత రెండు రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించిన రాష్ట్ర 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది. ముందుగా కాసీపూర్ సమితిలో పర్యటించిన ఆయన.. అనంతరం బిసంకటక్, గుణుపూర్ సమితుల్లో సుడిగాలి పర్యటన కొనసాగించారు. జిల్లాకు వరాల జల్లు కురిపించడంతో పాటు ఆయా ప్రాంతాల రూపురేఖలు మారిపోయేలా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇందులో భాగంగా కాసీపూర్ సమితిలోని ఖురింగి స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో సమావేశమయ్యారు. స్వయం ఉపాధి పథకం కింద చేపడుతున్న పుట్టగొడుగుల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతున్న ఇటువంటి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కాసీపూర్ ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. కాసీపూర్‌లో నూతనంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఉన్నత పాఠశాలల ఆధునీకరణకు సంబంధిత అధికారులకు ఆదేశించారు. దీనికి తక్షణమే నిధులు సమకూరుస్తామన్నారు. కాసీపూర్ సమితి టికిరిలో నిర్మితమవుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలకు కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

పర్యాటక స్థలంగా చాటికోన..

బిసంకటక్ సమితిలోని చాటికోనలో ఉన్న ప్రముఖ శైవక్షేత్రం పాతాలేశ్వర మందిరం అభివృద్ధి చేసేందుకు నిధులు సమకూరుస్తామని 5టీ కార్యదర్శి పేర్కొన్నారు. ఇందులో భాగంగా చాటికోన జలపాతాలను పర్యాటక స్థలంగా తీర్చి దిద్దుతామని, దీనికి అవసరమైన డీపీఆర్ తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో సమావేశమైన పాండ్యన్.. రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయం, విద్య, వ్యవసాయ దారులకు రాష్ట్రప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రకటించారు.

నాళియా బొందో ప్రాజెక్టు పరిశీలన

రానున్న విద్యా సంవత్సరంలో ప్రతి విద్యాలయంలో స్మార్ట్ తరగతులు ప్రారంభమవుతాయని వీకే పాండ్యన్ తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యాబోధన మెరుగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బిజూ స్వస్థ్య కల్యాణ సమితి పథకంలో పేర్లు నమోదు చేసుకోలేనివారు త్వరలో అంతర్భాగం కావాలని కోరారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం తగిన శ్రద్ధ వహిస్తోందన్నారు. బీఎస్‌కేవై పథకం ద్వారా మహిళలకు రూ.10 లక్షలు, పురుషులకు రూ.5 లక్షల వరకు చికిత్స ఖర్చు ఉచితంగా భరించనుందని వివరించారు. బిసంకటక్‌లోని నాళియా బొందో నీటి పారుదల ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందని ఆ ప్రాంత రైతులకు భరోసా ఇచ్చారు. ఇంటింటా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని, ఇప్పటికే మెగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందన్నారు. బరంపురం నుంచి జయపురం వరకు బిజూ ఎక్స్‌ప్రెస్ సడక్ యోజన పథకం కింద రూ.1200 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో రహదారుల ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. జిల్లాలోని పద్మపూర్ సమితిలో పర్యటించిన ఆయన.. మొరిచాగుడ గ్రామంలోని సవరలిపి బ్రహ్మ మందిరాన్ని సందర్శించారు. ఈ గ్రామాన్ని పర్యటక స్థలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

గుణుపూర్‌లో..

చివరిగా జిల్లాలోని గుణుపూర్‌లో 5టీ కార్యదర్శి పాండ్యన్ పర్యటించారు. స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు పూలవాన కురిపించి ఆయనకు ఘన స్వాగతం పలికారు. పెఫాలి పర్వతంపై ఉన్న రామేశ్వర మందిరంలో పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ మందిరం మరింత ప్రాచుర్యం పొందేలా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందని, అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇండోర్ స్టేడియంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గుణుపూర్‌లోని అన్ని కళాశాలలను 5టీ పథకంలో అంతర్భాగం చేసి, అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. పరిశీలనలో పాండ్యన్ వ్యక్తిగత కార్యదర్శి వెన్నెల కృష్ణ, కలెక్టర్, ఎస్పీ వివేకానంద శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



పద్మపూర్‌లో పర్యటిస్తున్న వీకే పాండ్యన్



గుణుపూర్‌లో వీకే పాండ్యన్‌తో కరచాలనం చేస్తున్న ప్రజలు

ఏం కావాలో అడగండి..



డొంగిరియా ఆదివాసీలతో మాట్లాడుతున్న పాండ్యన్, పక్కన కలెక్టర్ సింగ్

'డొంగిరియాల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసింది. అయితే అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. మీ పురోగతికి ఏం కావాలో అడగండి.. ప్రభుత్వం తక్షణమే మంజూరు చేస్తుంద'ని రాష్ట్రప్రభుత్వ 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ కోరారు. జిల్లాలోని బిసంకటక్ సమితిలో ఆయన పర్యటించారు. నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఖజురి గ్రామాన్ని సందర్శించారు. పర్వత ప్రాంతాల్లో కాలినడకనే చేరుకున్న ఆయన.. అక్కడి డొంగిరియాలతో మాట్లాడారు. పాండ్యన్ అడిగిన ప్రశ్నలకు అధికారులు స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ మాట్లాడుతూ డొంగిరియాల సమగ్రాభివృద్ధి కోసం ప్రస్తుతం డీకేడీఏ, ఒపిలిపి ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని తెలిపారు. త్వరలో మరో 4ప్రాజెక్టులు ఈ ప్రాంత అభివృద్ధి కోసం అమలు చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక విద్యావిధానంలో డొంగిరియాల్లో యువత ఎంతో ఉన్నతి చెందారని వివరించారు. ఏది ఏమైనప్పటికీ డొంగిరియా కొంధో తెగల్లోని ఆదివాసీల అభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా పాండ్యన్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో డొంగిరియా కొందొ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధికారి సుదర్శన్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కల పరిశ్రమలపై అధికారులు దాడులు

- 10మంది బాల కార్మికులకు విముక్తి



చైల్డ్‌లైన్, కార్మికశాఖ అధికారుల సంరక్షణలో బాల కార్మికులు

జయపురం: స్థానిక సమితిలోని జీడిపిక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న 10మంది బాల కార్మికులను జయపురం కార్మికశాఖ అధికారులు విముక్తి కలిగించారు. వీరిని శిశుసంక్షేమ కమిటీకి అప్పగించారు. సీబ్ల్యూసీ విభాగం నుంచి రిపోర్టు వచ్చిన అనంతరం చర్యలు తీసుకుంటామని జయపురం కమిషనర్ ప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. పోలీసు సిబ్బంది సహకారంతో చేపట్టిన ఈ దాడులకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జయపురం సమితిలోని దండసేనగుడ, దొరగుడ, కేవిడి, బిజ–2, గ్రామాల్లో నిర్వహిస్తున్న 7 జీడిపిక్కల ఫ్యాక్టరీలపై అధికారులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఈ మేరకు దండసేనగుడలో ఇద్దరు, దొరాగుడలో 8మంది బాల కార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించారు. వారి వయస్సు, చిరునామా తదితర వివరాలు సేకరించి, అనంతరం సురక్షితంగా సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. బాలలను తిరిగి బడిలో చేర్పేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. పనుల్లో బాల కార్మికులను వినియోగిస్తున్న యజమానులు, ఉద్యోగులకు నోటీసులు పంపడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. దాడుల్లో జయపురం సదర్ పోలీసు స్టేషన్ సిబ్బంది తోపాటు కార్మికశాఖ అధికారులు కమలాలోచన పండా, చైతన్యప్రసాద్ మఝి, పూర్ణిమ దురుక, జిల్లా శిశుసురక్షా అధికారి రాజశ్రీ దాస్, శిశు సంక్షేమ కమిటీ సభ్యులు భానుమతి పూజారి, చైల్డ్‌లైన్ ప్రతినిధి హేమంతకుమార్ పాత్రొ, బలరాం పాత్రొ, సిబ్బంది పాల్గొన్నారు.

594కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

బరంపురం: కొరాపుట్, గంజాం జిల్లాల పరిధిలో 594కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం ప్రకారం బరంపురం ఎక్సైజ్ అధికారులు హింజికాట్–దిగపండి–బరంపురం మూడు రోడ్ల జంక్షన్‌లో గస్తీ చేపట్టారు. ఫస్ట్‌గేట్ సమీపంలోని రామకృష్ణ పెట్రోల్ బంక్ వద్ద పికప్ వ్యాపై దాడి చేయగా, 300కిలోల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నిందితులు పశ్చిమబెంగాల్, మిదన్‌పూర్ జిల్లాకు చెందిన కునాల్ బెహరా, బిశ్వజిత్ రాణాను అరెస్ట్ చేశారు.

అడవిలో దాచిపెట్టి..

జయపురం: జిల్లా బొయిపరిగుడ సమితి మఝిగుడ పంచాయతీ పండితబెడ గ్రామం సమీపంలోని అడవిలో ఇతర ప్రాంతాలకు దొంగతనంగా తరలించేందుకు దాచి ఉంచిన గంజానికి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను ముందే పసిగట్టిన దుండగులు.. సరుకును వదలి పరారయ్యారని బొయిపరిగుడ పోలీసు అధికారి అశ్వినీకుమార్ పట్నాయక్ తెలిపారు. పండితబెడ గ్రామ సమీపంలోని అడవి నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి తరలించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందడంతో సబ్ ఇన్‌స్పెక్టర్ బిష్ణుప్రసాద్ శబర, సిబ్బంది దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన దుండగులు.. గంజాయిని వదిలి, అడవిలోకి పరారయ్యారు. దీనిని బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధారాణి చౌధురి సమక్షంలో తూకం వేయగా 294కిలోలు ఉన్నట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేశామని వివరించారు. దాడిలో ఎస్‌ఐ కృష్ణచంద్ర సెథి, ఏఎస్‌ఐ మోదీసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: అడవిలో పోలీసులకు పట్టుబడిన గంజాయి బస్తాలు

చైతన్య రథం ప్రారంభం



చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రధాన్

జయపురం: సబ్ డివిజన్‌లో బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా ప్రజలను చైతన్య పరిచేందుకు సచేతన రథాన్ని సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ ప్రారంభించారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జెండా ఊపి, రథాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలు, నోటిఫైడ్ ఏరియ కౌన్సిల్(ఎన్ఏసీ) జయపురం, లక్ష్మీపూర్, పొట్టంగి, బొరిగుమ్మ సమితులలో 4రోజులు పర్యటిస్తుందని జయపురం కార్మికశాఖ కమిషనర్ ప్రసన్నకుమార్ పాణిగ్రహి తెలిపారు. బాలకార్మిక వ్యవస్థపై సచేతన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేస్తూ.. 14ఏళ్ల లోపు వారిని కార్మికులుగా పని చేయించడం వల్ల ఎదుర్కోవాల్సిన ఇబ్బందులు, చట్టపరమైన చర్యలపై ప్రజలను చైతన్యవంతం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజశ్రీ దాస్, సిడబ్ల్యూసీ చైర్మన్ గాయత్రీపాత్రొ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి జారిపడి వృద్ధురాలి మృతి



ఆస్పత్రిలో జమున గౌడ మృతదేహం

జయపురం: బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదవశాతు జారిపడి, వృద్ధురాలు మృతిచెందిన ఘటన బొయిపరిగుడ సమితి మొసిగింలో చోటు చేసుకుంది. కొలియారిపుట్–దిగాపూర్ గ్రామాల మధ్య ఉన్న డైనజొడి వంతెన వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మొసిగాం పంచాయతీ కులుమిలు గ్రామానికి చెందిన జమున గౌడ(70) తన కుమారుడు చంద్ర గౌడతో కలిసి బుధవార ఉదయం బైక్‌పై బలియ సమీపంలోని పలిగుడ గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా డైనజొడి వంతెన వద్ద వేగంగా వెళ్తున్న బైక్ పైనుంచి ఆమె జారి పడింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని స్థానికులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా మారడంతో వెంటనే కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం గురువారం ఉదయం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రతి రైతుకు మద్దతు ధర చెల్లించాలి



రబీ మండీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

- ధాన్యం మండీని ప్రారంభించిన ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: రబీ ధాన్యం కొనుగోలులో ప్రతి రైతుకు మద్దతు ధర చెల్లించి, ధాన్యం కొనుగోలు చేయాలని జయపురం ఎమమెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సూచించారు. నియోజకవర్గ పరిధి బొరిగుమ్మ సమితి రతాలీ గ్రామంలో రబీ ధాన్యం కొనుగోలు మండీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండీలు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేయాలని గుర్తుచేశారు. అలాగే ప్రతి పంచాయతీలో ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తగిన పరిమాణంలో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లై అధికారి ప్రదీప్ కుమార్ పండా మాట్లాడుతూ కొరాపుట్ జిల్లాలో ఈ ఏడాది రబీలో 12 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దీనికోసం 38కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 15 లేంపులు, 20 మహిళా స్వయం సహాయక సంఘాలు, 3 పాణీ పంచాయతీలు సేకరణ చేపడతాయని వెల్లడించారు. అలాగే ఇప్పటి వరకు 21,365మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్ఏక్యూ నాణ్యత గల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నామని, స్థానిక మిల్లర్స్ సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, బొరిగుమ్మ తహసీల్దార్ సత్యసాచి జెనా, జిల్లా పరిషత్ సభ్యులు పింకు శత్పతి, బొరిగుమ్మ సమితి మిల్లర్సు అసోసియేషన్ అధ్యక్షుడు దుర్యోధన పాణి, పలువురు మిల్లర్లు, లేంపు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం బస్సును నవరంగ్‌పూర్‌కు పొడిగించండి



ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, దేవాశీస్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలుగు ప్రజలు

- ఎమ్మెల్యే ప్రధాన్‌కు తెలుగు ప్రజల వినతి

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ లోని పార్వతీపురం నుంచి జయపురం మధ్య రాకపోకలు సాగిస్తున్న ఓఎస్ఆర్‌టీసీ బస్సు సర్వీసును నవరంగ్‌పూర్ వరకు పొడిగించాలని తెలుగు ప్రజలు కోరారు. ఈ మేరకు నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్‌ను ఆయన నివాసంలో గురువారం కలుసుకొని, వినతిపత్రం అందించారు. పార్వతీపురం నుంచి నారాయణపట్న మీదుగా జయపూర్‌కు నడుస్తున్న ఆర్‌టీసీ బస్సును నవరంగ్‌పూర్ వరకు పొడిగించాలన్నారు. పార్వతీపురం–నవరంగ్‌పూర్‌లో సుమారు 300 కుటుంబాలకు పైగా కుటుంబాలు సంబంధ, బాంధవ్యాలు ఉన్నాయని తెలిపారు. జయపురం నుంచి మరో 42 కిలోమీటర్లు సర్వీసును పెంచడం వల్ల ఎంతోమందికి లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బీజేడీ జిల్లా సహ పరిశీలకుడు దేవాశీష్ పాత్రొ వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన సదాశివ ప్రధాన్.. తక్షణమే బస్సు పొడిగించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

డీఎంహెచ్ఓను కలిసిన ఐఎంఏ ప్రతినిధులు



డీఎంహెచ్ఓ భాస్కరరావుకు అభినందనలు తెలియజేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావును ఆయన చాంబర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతినిధులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయ చంద్రనాయుడు, డాక్టర్ వీఎస్. ప్రసాద్, డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీకొని నలుగురికి గాయాలు



రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గేదెల చిన్నమ్మి



కొత్తూరులో వైద్యసేవలు పొందున్న క్షతగాత్రుడు

భామిని: మండలంలోని అత్తికొత్తూరు సెంటర్‌లో గురువారం ఆటో-కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. కొత్తూరు నుంచి గజపతినగరం వస్తున్న ఆటోను భామిని నుంచి కొత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి నుజ్జునుజ్జయింది. కారు కూడా దెబ్బతింది. ఆటోలో ప్రయాణిస్తున్న గజపతినగరానికి చెందిన గేదెల చిన్నమ్మి, గేదెల కృష్ణ, గొర్లె లక్ష్మణ గేదెల పాలోలు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ రప్పించి కొత్తూరు సీహెచ్‌ఎన్‌సీకి క్షతగాత్రులను తరలించి వైద్యాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. తీవ్రగాయాల పాలైన గేదెల చిన్నమ్మిని శ్రీకాకుళం రిమ్స్‌కు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

నేడు, రేపు బబ్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్‌పై శుక్ర, శనివారాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సిహెచ్.సంధ్య గురువారం తెలిపారు. దీనిని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీనివాసునికి పంచామృతభిషేకాలు



శ్రీక్షేత్రమ్‌లో శ్రీనివాసునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి గురువారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కథా శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కథా శిక్షణ కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకుంది. తెలుగు భాషపై పట్టు పెంచడంతో పాటు కథలు రాయడం, కథా పఠనం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందజేశారు. కథా అంశాలను స్వయంగా తీసుకునే విధానం నేర్పించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 40 మంది బాల బాలికలకు ఉపాధ్యాయుడు ఆర్.ఈశ్వర్ శిక్షణ ఇచ్చారు. అనంతరం తన్మయి, షణ్ముఖప్రియ, సాహితీ ప్రియ నిర్వహించిన సంగీత, నృత్య కార్యక్రమం అలరించింది.

కెనాల్ రోడ్డు నిర్మాణంపై దర్యాప్తు చేపట్టాలి

- విజిలెన్స్ ఎస్పీకి నసకావిడి గ్రామస్తుల వినతి



విజిలెన్స్ కార్యాలయం వద్ద హరిరావు, గ్రామస్తులు



నాసిరకంగా దర్శనమిస్తున్న కెనాల్ రోడ్డు

జయపురం: స్థానిక సమితిలోని రొండాపల్లి పంచాయతీ నసకావిడి గ్రామం సమీపంలోని అప్పర్ కొలాబ్‌శాఖ కెనాల్ సాగునీటి విభాగం నిర్మించిన పిచు రోడ్డు అధ్వానంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త బి.హరిరావు నేతత్వంలో గ్రామస్తులు జయపురంలోని కొరాపుట్ విజిలెన్స్ డివిజన్ ఎస్పీని కలిసి, వినతిపత్రం అందించారు. రోడ్డు నిర్మాణంలో చోటు చేసుకున్న అక్రమాలపై వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. రూ.8లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు పూర్తయి కనీసం నెల రోజులు కూడా పూర్తి కాకముందే రాళ్లు తేలి బయటకు కనిపిస్తున్నాయని తెలిపారు. నిర్మాణ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కెనాల్ పరిశీలించేందుకు అధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. నాణ్యతపై దృష్టి సారించలేదని విమర్శించారు. మరోవైపు ఈ ప్రాంత రైతులు నాగళ్లు, ట్రాక్టర్ల ప్రయాణాలకు ఇదే మార్గాన్ని వినియోగించాల్సి ఉన్నందున వర్షాల సీజన్‌లో మరిన్ని ఇబ్బందులు తప్పవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టడంతో పాటు బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బుడి హరిజన్, అశోక్ నాయక్, డొంబురుదొర ఖీలో, జగన్నాథ్ హరిజన్, భగవతి ఖీలో తదితరులు పాల్గొన్నారు.

300లీటర్ల సారా ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: స్థానిక సమితిలోని సమితి బలియ పంచాయతీ నీలాగుడ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఇందులో 300లీటర్ల సారాతో పాటు 3,300 లీటర్ల విప్ప ఊట ధ్వంసం చేశామని విభాగం జయపురం అధికారి సంజయకుమార్ కండి తెలిపారు. ధ్వంసం చేసిన వీటి విలువ రూ.లక్షా 80 వేలు ఉంటుందని వెల్లడించారు. అలాగే తయారీకి వినియోగంచే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో బొయిపరిగుడ ఎక్సైజ్ విభాగ అధికారి శరత్‌చంద్ర బారిక్, బొరిగుమ్మ అధికారి బిశ్వజిత్ పాణిగ్రహి, సిబ్బంది పాల్గొన్నారని పేర్కొన్నారు. నిందితులంతా పరారు కాగా.. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నాలా పనులతో ఇబ్బందులు



అర్ధంతరంగా నిలచిపోయిన నాలా పనులు

పర్లాకిమిడి: పట్టణంలోని 3వ వార్డు రాజగురు వీధి జంక్షన్ పిట్టల చెరువు వద్ద నిర్మాణంలో ఉన్న నాలా పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రాజగురు వీధి, పరలా వీధి మీదుగా ఆటోలు, మోటారు సైకిళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కాంట్రాక్టు పనులు మహిళా స్వయం సహాయక సంఘానికి అప్పగించగా.. పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు.

దీనిని సకాలంలో పూర్తి, రాకపోకలు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు మున్సిపల్ ఈఓను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ మృతి



అభిషేక్ పట్నాయక్

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి కొండూరు గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా పవర్ ట్రాన్స్‌మిషన్ సూపర్‌వైజర్ అభిషేక్ పట్నాయక్(26) మృతిచెందాడు. మృతుడు కాశీనగర్ టాటా ఏజెన్సీ తరఫున విద్యుత్ పనులపై సిబ్బందికి శిక్షణ ఇచ్చి, తిరిగి పర్లాకిమిడికి బైక్‌పై వెళ్తుండగా కొండూరు వద్ద ఆటో ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ మేరకు స్థానికులు పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాశీనగర్ ఐఐసీ అధికారి సాహు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడు లేని బతుకు వ్యర్థమని..!

- గన్నేరు పిక్కలు మింగి యువతి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పుష్పవతి

గుమ్మలక్ష్మీపురం: ప్రియుడు లేని లోకంలో తాను జీవించలేనని, తన జీవితం వ్యర్థమైపోయిందని మనస్తాపం చెందిన ఓ యువతి గన్నేరుపిక్కలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. గుమ్మలక్ష్మీపురం మండలంలో జరిగిన ఈ విషాద సంఘటనపై ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొంగరికిక్కువ గ్రామానికి చెందిన కోలక కిశోర్ పాముకాటుకు గురై చికిత్సపొందుతూ వారం క్రితం మృతిచెందాడు. వరుసకు బావ అయిన కిశోర్‌తో ప్రేమలో ఉన్న అదే గ్రామానికి చెందిన తాడంగి పుష్పవతి (19) కిశోర్ మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గన్నేరుపిక్కలు నూరి మింగేసింది. అపస్మారక స్థితిలో ఉన్న పుష్పవతిని గుర్తించిన కుటుంబసభ్యులు కురుపాం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి చిన్నప్పుడే చనిపోగా తల్లి లక్ష్మి అన్నీ తానై చూసుకునేది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడు..

బొబ్బిలి: మండలంలోని రెడ్డియ్యవలసకు చెందిన సొంగలి గణేష్(21) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. డిగ్రీ పూర్తిన గణేష్ ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఏమైందో ఏమో కానీ బుధవారం రాత్రి పురుగు మందు తాగేశాడు. ఈ విషయం గుర్తించిన కుటుంబసభ్యులు బొబ్బిలి సీహెచ్‌సీకి గణేష్‌ను తీసుకురాగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు విజయనగరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలపై కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీమల మందు తాగి వ్యక్తి..

పాచిపెంట: భార్య మందలించిందని మనస్తాపానికి గురైన వ్యక్తి చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం పాచిపెంట మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పద్మాపురం పంచాయతీ పింద్రంగివలస గ్రామానికి చెందిన డి.రాజు మద్యానికి బానిసై భార్యతో తరచు గొడవపడేవాడు. ఈ క్రమంలో పది రోజులక్రితం భార్యతో గొడవ పడగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం మద్యం తాగిన రాజు భార్య వద్దకు వెళ్లి ఇంటికి రావాలని కోరగా నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిసాయంత్రం చీమల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



వజ్రపుకొత్తూరు: అయ్యప్ప స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



టెక్కలి: వార్షిక కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వజ్రపుకొత్తూరు: టెక్కలి డివిజన్‌లోనే అతి పెద్ద అయ్యప్ప స్వామి ఆలయం 13వ వార్షికోత్సవం గురువారం పూండిలో వైభవంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుంచి సుప్రభాత సేవ, నిర్విఘ్న గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తులు ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామి, లలితా, అభయాంజనేయ, నాగరాజ దేవతలకు ప్రత్యేక ఆరాధన, అర్చన పూజలు చేపట్టారు. అనంతరం అయ్యప్పస్వామి దివ్య దర్శనం చేసకున్న భక్తులు ఉత్సవ విగ్రహానికి పంచామృత, 121 నారికేళ, జలాభిషేకములు చేపట్టారు. సహస్ర నామార్చన, విశేష హోమాలను ఆలయ గురుస్వామి రాళ్లపేట కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

టెక్కలి: పట్టణంలోని శ్యామసుందరస్వామి ఆలయం వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో వి.వి.ఎస్.నారాయణ పర్యవేక్షణలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కాశీబుగ్గ: పలాస తహసీల్దార్ మధుసూదనరావుకు గురువారం త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. పలాస మండలం మాకన్నపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి హాజరై, తిరుగు వెళ్తుండగా సున్నాదేవి రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్నటువంటి ఆటో, తహసీల్దార్ కారు ఒకదానికొకటి బలంగా ఢీకొనడంతో ఆటో బోల్తాపడి పల్టీలు కొట్టింది. అయితే తహసీల్దార్ మధుసూదనతో పాటు ఆటో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయ శంకుస్థాపన

నందిగాం: మండల కేంద్రమైన నందిగాంలో పాతపట్నం అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు సమష్టిగా నూతన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి పాల్గొన్నారు

ఉత్సాహ భరితంగా ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్



వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు విజయానందం

- రాయలసీమ క్వీన్స్, వైజాగ్ డాల్ఫిన్స్ విజయం



రాయల సీమ క్వీన్స్ జట్టు

విజయనగరం: విజయనగరం వేదికగా జరుగుతున్న ఉమెన్స్ టీ-20 క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగుతున్నాయి. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా గురువారం బెజవాడ బ్లేజర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాయల సీమ క్వీన్స్ జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

టాస్ ఓడిన బెజవాడ బ్లేజర్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 97 పరుగులు జోడించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 17.2 ఓవర్లలో వికెట్ నష్టపోయి 98 పరుగులు జోడించి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్‌లో విజయనగరం రాయల్స్ జట్టుపై వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 140 పరుగులు జోడించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం రాయల్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 98 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ



ప్రయాణికుడికి పర్సు ఇస్తున్న డిపో మేనేజర్ రమేష్, డ్రైవర్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: బస్సులో పర్సు పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అందజేసి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. గురువారం విజయనగరం నుంచి కొట్యాడ మీదుగా ఎస్.కోట వస్తున్న బస్సులో బొద్దాంలో దిగాల్సిన ప్రయాణికుడు తూర్పాటి రమేష్ పర్సు పోగొట్టుకున్నాడు. పర్సులో ఏటీఎం కార్డులు, రూ.2000 నగదు ఉన్నాయి. ఎస్.కోట డిపోలో బస్సు ఆగిన తర్వాత సిబ్బంది తనిఖీ చేయగా పర్సు దొరికింది. సిబ్బంది వెంటనే డిపో మేనేజర్ కె.రమేష్‌కు పర్సు అందజేశారు. దీంతో డిపో మేనేజర్ ప్రయాణికుడు రమేష్‌ను రప్పించి పర్సు అందజేశారు.

నగర వనం చూసొద్దాం రండి

- ఆకట్టుకుంటున్న అడవి మృగాలు, పక్షుల శిల్పాలు
- చిన్నారులు ఆడుకోవడానికి సిద్ధంగా పార్కు



సారిపల్లి సెంట్రల్ నర్సరీలోని నగర వనం



చిల్డ్రన్ పార్కు



నగర వనం వ్యూ



చెట్ల కింద ఏర్పాటుచేసిన బెంచీలు



గుహలో గబ్బిలాలు, గుడ్లగూబ, కొండచిలువ శిల్పాలు



గిరినాగు శిల్పం



పక్షుల బొమ్మలతో కూడిన పార్కు



మ్యూజియంలో వన్యమృగాల శిల్పాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పారిశ్రామిక వాడలోని సారిపల్లి సెంట్రల్ నర్సరీలో ఏర్పాటుచేసిన నగర వనం సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వనంలో పిల్లలతో పాటు పెద్దలు సైతం తిలకించడానికి వన్యమృగాలు, పక్షులు, సర్పాల శిల్పాలతో కూడిన మ్యూజియం అందుబాటులో ఉంది. అన్నిరకాల అడవి జాతి మొక్కలు, వృక్షాలతో కూడిన రాశి వనంను ఇక్కడ ఏర్పాటుచేశారు. చిన్నారులు ఆడుకోవడానికి వీలుగా పలు రకాల ఆట వస్తువులతో కూడిన పార్కు సిద్ధం చేశారు. ఆహ్లాదకరంగా చెట్ల కింద కూర్చోడానికి సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. సందర్శకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పించారు. కొండపైకి ఎక్కే ట్రెక్కింగ్ పనులు ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే ఇది కూడా అందుబాటులోకి రానుంది. విజయనగరం నుంచి నెల్లిమర్లకు వెళ్లే దారిలో ఊటగెడ్డకు ముందు నెల్లిమర్ల పారిశ్రామిక వాడ, టిడ్కో కాలనీకి వెళ్లే మార్గంలో పూల్‌బాగ్ రిజర్వ్ ఫారెస్టులో 50 హెక్టార్లలో ఈ నగర వనం ఉంది. ఇక్కడి నుంచి 2 కిలోమీటర్ల దూరంలోనే చంపావతి నది తీరంలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన సారిపల్లి దిబ్బేశ్వరాలయం ఉంది. ఆలయానికి సమీపంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ ఆయుర్వేద ఎత్నిక్ విలేజ్(ఆశ్రమం) ఉంది. సారిపల్లి సెంట్రల్ నర్సరీలోని నగర వనాన్ని ఈ ఏడాది మార్చి 1 నుంచి సందర్శకులకు అందుబాటులో ఉంచామని డీఎఫ్ఓ శంబంగి వెంకటేష్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నగర వనంలోకి సందర్శకులను అనుమతిస్తామన్నారు. సందర్శకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(ఐటీఐ)లోని స్కిల్ హబ్‌లో నిర్వహిస్తున్న స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి కనీస విద్యార్హతగా కలిగిన 18 ఏళ్లు పూర్తయిన పురుషులు అర్హులని తెలిపారు. ఈ నెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయటంతో పాటు పలు కంపెనీల్లో ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు వివరించారు.

10న వర్సిటీలో బీఆర్ జయంతి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 10న ఆదర్శ నేత బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. వర్సిటీలో ఆయన గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈ అధికారిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు.

డీటీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డీటీసీ శివరామ్‌ప్రసాద్

శ్రీకాకుళం రూరల్: జిల్లా ఉపరవాణాశాఖాధికారి ఎస్.శివరామ్‌ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకూ డీటీసీగా పనిచేసిన సీహెచ్ శ్రీదేవి విశాఖపట్నానికి బదిలీ అయ్యారు. కొత్త డీటీసీని ఆర్టీఓ దేవి, ఇన్‌స్పెక్టర్లు టి.ప్రసాద్‌రెడ్డి, పి.వి.గంగాధర్, ఎస్.వెంకటరావు, అమృతకుమారి, ఏఓ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రపతి భవన్‌కు గిరిజనుల పయనం



రాష్ట్రపతిని కలిసేందుకు పయనమైన గిరిజనులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 10 మంది గిరిజనులు గురువారం రాష్ట్రపతి భవన్‌కు పయనమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 12న వీరితో భేటీకానున్నారు.

జిల్లా విద్యార్థినికి ఏపీఆర్‌జేసీలో 95వ ర్యాంకు



నందిగాం/కాశీబుగ్గ: నందిగాం మండలం పాలూరు గ్రామానికి చెందిన పోలాకి జ్యోత్స్న గురువారం రాత్రి విడుదలైన ఏపీఆర్‌జేసీలో సత్తా చాటింది. బైపీసీ గ్రూపులో బీసీ ఏ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 95వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా తండ్రి నరసింహమూర్తి, అధ్యాపకులు కోనారి చిరంజీవులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని వాడాడ జంక్షన్ వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన మోస నారాయణస్వామి (48) మృతి చెందారు. ఈయన సీమెన్‌గా పనిచేస్తున్నారు. సెలవుపై కొద్దిరోజుల క్రితం ఇంటికి వచ్చారు. అరసవల్లిలో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా వాడాడ జంక్షన్ వద్ద అదుపుతప్పి పడటంతో మృతి చెందారు. భార్య శ్రీవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

700 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కొత్తూరు: కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీలో తంగుడు గురుమూర్తి ఇంటిలో గురువారం అక్రమ బియ్యం నిల్వలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 700 కిలోల బరువు గల 16 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. తెల్లరేషన్ కార్డుదారుల వద్ద నుంచి ఈ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. బియ్యంను సీజ్ చేసి కొత్తూరు రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అప్పగించిన బియ్యంను స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు అప్పగించారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలంతో పాటు సిబ్బంది, ఆర్‌ఐ లక్షణరావు, వీఆర్వో వి.బాలకృష్ణలతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రైమ్ న్యూస్

టైరు పేలి వ్యాన్ బోల్తా

- ఒకరు మృతి, 14 మందికి గాయాలు
- బాధితులంతా విజయనగరం జిల్లావాసులే



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

లావేరు: మండలంలోని బుడుమూరు వద్ద గురువారం ఉదయం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారు. లావేరు ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా డెంకాడ మండలం బంగారాజుపేట, కొండరాజుపేట, వల్లభపేట, ఉప్పాడపేట, అవ్వపేట గ్రామాలకు చెందిన 15 మంది వ్యక్తులు గురువారం ఉదయం వ్యాన్‌లో మేకలను తీసుకొని జలుమూరు మండలం తిలారు వద్ద జరిగే సంతకు బయలుదేరారు. లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి టైరు పేలిపోవడంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న 15 మంది, మేకలు చెల్లాచెదురుగా జాతీయ రహదారిపై పడిపోయాయి. సరగడ చిట్టిబాబు(14) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, 14 మందికి గాయాలయ్యాయి. కొన్ని మేకలు కూడ మృత్యువాతపడ్డాయి. విషయం తెలుసుకున్న వెంటనే బుడుమూరు గ్రామస్తులు స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఘటనా స్థలానికి చేరకుని సహాయక చర్యలు చేపట్టారు. 108కు సమాచారం అందించి అంబులెన్సుల్లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. స్టేషన్ ఎస్‌ఐ కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, హైవే పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. క్రేన్‌ను రప్పించి బోల్తాపడిన వ్యాన్‌ను రోడ్డు పక్కకు చేర్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతి చెందిన చిట్టిబాబు



క్షతగాత్రులను అంబులెన్సులో ఎక్కించడానికి తీసుకువెళుతున్న బుడుమూరు గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ మృతి



ప్రమాదంలో నుజ్జయిన అంబులెన్స్



డ్రైవర్ రాజేశ్ మృతదేహం

మందస: మృతదేహాన్ని బంధువులకు అప్పగించి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మందస మండలం కొత్తపల్లి జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన డ్రైవర్ మున్నంగి రాజేశ్ పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని అప్పగించేందుకు మరోవ్యక్తి మేదరమెట్ల భరత్‌కుమార్‌తో కలిసి బయలుదేరారు. మృతదేహాన్ని అప్పగించి విజయవాడ తిరిగి వస్తున్న క్రమంలో మందస మండలం కొత్తపల్లి జాతీయ రహదారిపై లారీ వెనుక నుంచి వచ్చి అంబులెన్స్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్(27)కు తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేశ్ మరణించాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు మందస ఎస్‌ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానానికి వెళ్లి వస్తుండగా..

- బస్సు కింద పడి వృద్ధురాలి మృతి



త్యాడ భూషణం(ఫైల్)

సోంపేట: మండలంలోని బారువ చాట్లబజారు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేసిరామచంద్రాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు త్యాడ భూషణం (86) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. త్యాడ భూషణం ప్రతి గురువారం బారువ షిర్డీ సాయిబాబా మందిరానికి వచ్చి పూజలు నిర్వహించి అన్న ప్రసాదం స్వీకరించి తిరిగి స్వగ్రామానికి చేరుకునేది. గురువారం కూడా బాబా ఆలయం వద్ద అన్న ప్రసాదం స్వీకరించి బస్సుకోసం ఎదురుచూస్తోంది. బారువ నుంచి ఇచ్ఛాపురం వెళ్లే ఆర్టీసీ బస్సు తమ గ్రామానికి వెళ్తుందేమో అని అడిగేందుకు బస్సు దగ్గరకు వెళ్లింది. ఆ బస్సు కాకపోవడంతో వెనక్కు వచ్చింది. ఈ క్రమంలో వృద్ధురాలి చీర తగలడంతో బస్సు కింద పడిపోయింది. తలకు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బారువ ఎస్‌ఐ చిరంజీవులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

లావేరు: మురపాక గ్రామానికి చెందిన బుడుమూరు ఎర్రమ్మ(65) పాముకాటుతో మృతి చెందింది. లావేరు స్టేషన్ హెచ్‌సీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం..ఎర్రమ్మ గురువారం వేకువజామున ఇంటిపక్కనే ఉన్న బెంచీపై కూర్చుని బ్రష్ చేస్తుండగా పాముకాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎర్రమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమారుడు ఎర్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఎస్‌ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని..



మృతుడు సూర్యనారాయణ(ఫైల్)

జలుమూరు: జోనంకి పంచాయతీ గంగాధరపేట జంక్షన్ వద్ద బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన కూన సూర్యనారాయణ గురువారం రిమ్స్‌లో మృతి చెందినట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడి భార్య అమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పిన బొలెరో వాహనం

- మూడు వాహనాలకు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలు



బస్సును ఢీకొట్టిన బొలెరో లగేజీ వాహనం

నరసన్నపేట : మండల కేంద్రం నరసన్నపేట పరిధిలోని పాతబస్టాండ్ సమీపంలో గురువారం బొలెరో లగేజీ వాహనం అదుపు తప్పడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ముందుగా రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొని ఎదురుగా పార్కు చేసి ఉన్న మరో ప్రయివేటు బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసన్నపేట హడ్కో కాలనీకి చెందిన ఎండీ షబ్బీర్, జమ్ముకు చెందిన తాళ్ల సీతమ్మ, ఈమె కవల పిల్లలు తాళ్ల జోషిత్, తాళ్ల జోషితలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు భీతిల్లారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్రేక్ ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

అంతర్ ట్రిపుల్ ఐటీ స్పోర్ట్స్ మీట్ నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లో గురు, శుక్ర, శనివారాల్లో అంతర్ ట్రిపుల్ ఐటీల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. బాలురుకు జరిగే ఈ పోటీల్లో ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లు శ్రీకాకుళం, ప్రకాశం, ఇడుపులపాయ, నూజివీడు క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. శివానీ క్యాంపస్‌లో క్రికెట్, ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరగుతాయని చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేసి, నాలుగు క్యాంపస్‌లు నుంచి ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాలు, సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల పోటీలకు పంపిస్తామని వివరించారు. శుక్రవారం ఉదయం జరిగే క్రీడల ప్రారంభోత్సవానికి ఆర్‌జీయూకేటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ పాల్గొన్నారు.

'మిల్లర్లు బియ్యం అందించాలి'



మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మిల్లర్లు బకాయి ఉన్న బియ్యంను సకాలంలో అందజేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 200 రైస్ మిల్లర్లు 38 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి బకాయి ఉండగా, ఈ నెల 20 తేదీలోగా 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యంను ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లైకి అందజేయాలని తెలిపారు. సకాలంలో బకాయిలు చెల్లించకుంటే బ్యాంకు గ్యారెంటీలను జప్తు చేస్తామన్నారు. మిల్లులలో సీసీ కెమెరాలు, డ్రయర్ మిషన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రైస్ సరఫరాలను రోజు వారీ నివేదికలు అందజేయాలని తెలిపారు. సమావేశంలో డీఎం సీఎస్ జయంతి, డీఎస్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక పరికరాల వితరణ



అగ్నిమాపక పరికరాలు అందజేస్తున్న అరబిందో ప్రతినిధులు

రణస్థలం: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి గురువారం జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావుకు అగ్నిమాపక పరికరాలు అందజేశారు. రూ.5 లక్షల విలువైన కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, అగ్నిమాపక పరికరాలను పైడిభీమవరం పారిశ్రామికవాడలోని అరబిందో పరిశ్రమలో అందించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ పరికరాలు, కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు వంటివి వైపరీత్యాల సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. పరికరాలు అందజేసినందుకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అసిస్టెంట్ అధికారి వరప్రసాద్, అరబిందో హెచ్ హెడ్ కె.కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ రథయాత్రకు ప్రత్యేక బస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా శ్రీకాకుళం నుంచి పూరీకి ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి బయలుదేరి 20వ తేదీ ఉదయం 6 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుందని, అక్కడ లింగరాజు ఆలయ దర్శనం అనంతరం 10 గంటలకు కోణార్క్ సూర్య దేవాలయ దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు పూరి చేరుకుంటుందని తెలిపారు. రథయాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 21వ తేదీ ఉదయం శ్రీకాకుళం బస్సుస్టేషన్‌కు ప్రత్యేక బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణ ఛార్జి రూ.2200 గా నిర్ణయించామన్నారు. శ్రీకాకుళం బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు లభిస్తాయని చెప్పారు. పూర్తి వివరాలకు 7382921647, 9959225608 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సిమ్మయ్య, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గగన వీధిలో..



నింగి రంగు పులుముకుంది. నిలువెల్లా మండుతున్న భానుడి అరుణారుణ కిరణాలతో గగన వీధి కొత్తగా కనిపించింది. ఓ భవంతిపై కష్టపడుతున్న కార్మికుడి స్వేదం సాక్షిగా సూర్యభగవానుడు శ్రీకాకుళంలో ఇలా కనిపించాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఆదిత్యుని ఆదాయం అరకోటి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. మొత్తం 36 రోజులకు గాను రూ.51,40,769 ఆదాయం సమకూరింది. అధికంగా నగదు రూపంలో రూ.49,61,426, చిల్లర రూపంలో రూ.1,79,343, ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. వీటితో పాటు 53 గ్రాముల బంగారం, 4 కిలోల 100 గ్రాముల వెండి వస్తువులు మొక్కులుగా లభించినట్లుగా తెలియజేశారు. వీటితో పాటు విదేశీమారకద్రవ్యం రూపంలో కూడా మొక్కులను విదేశీ భక్తులు చెల్లించుకున్నారు. లెక్కింపు కార్యక్రమంలో రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్ కిషోర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి మహాలక్ష్మి, లుకలాపు గోవిందరావు, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంటు రవి కుమార్, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గత నెల 5వ తేదీ నుంచి ఈనెల 8వ తేదీ వరకు మొత్తం 36 రోజుల్లో గల హుండీ కానుకల ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం లభించినట్లుగా ఈఓ చెప్పారు. నకిలీ వెండి, బంగారు కళ్లను తగులబెట్టారు.

ఈసీసీఈ కోర్సు ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కోర్సు ప్రవేశానికి విద్యా విభాగం కార్యాలయంలో ప్రవేశాల కౌన్సెలింగ్ గురువారం నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ శుక్రవారం సైతం కొనసాగనుంది. మొదటి రోజు కౌన్సెలింగ్‌కు 22 మంది హాజరయ్యారు. 50 సీట్లు ఈ కోర్సుల్లో ఉండగా, 58 మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎన్.శ్రీనివాస్ కౌన్సెలింగ్ ప్రక్రియ పర్యవేక్షించారు.

వంద శాతం రీ సర్వే పనులు పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జూన్ మాసాంతానికి పూర్తి కావాల్సిన రీసర్వే పనుల్లో దాదాపు వంద శాతం పూర్తయినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్‌కు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రీ సర్వే పనుల పురోగతిపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సంయుక్త కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి వీసీలో పాల్గొన్న జేసీ మాట్లాడుతూ.. రెండో విడత రీసర్వే పనుల్లో జూన్ మాసానికి గాను 150 గ్రామాలు లక్ష్యంగా పెట్టుకున్నామని, 133 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని తెలిపారు. దీనికి గాను కమిషనర్ జేసీని అభినందించారు.


'మెరుగైన సేవలు అందించాలి'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖాధికారులందరూ ప్రజా సేవకులని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా, శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు జిల్లా అధికారులకు సూచించారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం గురువారం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రయో జన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఆ విధంగా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తారని, సమస్య లేకుంటే ఆ కేసును ముగిస్తారని వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అందిస్తున్న సేవల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేదని, ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు ఫైల్ చేయడానికి ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి కేసైనా 90 రోజుల్లో పరిష్కారమవుతుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞానసువర్ణరాజు మాట్లాడుతూ జిల్లాలోని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల ద్వారా అందజేస్తున్న సేవలు గురించి ఆయా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలలోని లోపాలు కారణంగానే కోర్టును ఆశ్రయిస్తారని, అలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎస్. గణపతి, జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ కుమార్, ఎల్‌ఐసీ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, డ్వామా, టెలికాం పరిపాలన అధికారులు కె.వి.ప్రసాద్, జె.పాపారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

2015లో చనిపోతే 2022లో ఉపాధి పనిచేశారా?



విచారణ నిర్వహిస్తున్న టెస్ట్ ఆడిట్ బృందం

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ నీలాపు ప్రసాద్‌రెడ్డిపై టెస్ట్ ఆడిట్ బృందానికి వేతనదారులు శుక్రవారం ఫిర్యాదులు చేశారు. నౌపడ గ్రామానికి చెందిన జీరు ధర్మారావు 2015లో చనిపోతే 2022లో ఉపాధి పని చేసి వేతనాలు జమ అయినట్లు టెస్ట్ ఆడిట్‌లో వెలుగు చూసింది. తాము గత ఏడాది పని చేసినా ఇంత వరకు బిల్లులు చెల్లించలేదని వేతనదారులు సుగ్గు మరిడమ్మ, రోకళ్ల కామమ్మ, రోకళ్ల లక్ష్మీ, కర్రి కోటిబాబు, కర్రి రాజుతో పాటు సుమారు 30 మంది ఆడిట్ బృందానికి ఫిర్యాదు చేశారు. 2020లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ప్రసాద్‌రెడ్డికి ఇప్పటికీ ఉపాధి వేతనం వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన సిద్దా ప్రమీల, అంపలాం శ్రీనివాసరావు, అనపాన పద్మల ఖాతాలకు ఉపాధి వేతనాలు జమవుతున్నాయని ఫిర్యాదు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆడిట్ అధికారులు తెలిపారు.

మళ్లీ కలిశారు..!



పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993 నుంచి 1998 వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు గురువారం అదే పాఠశాలలో మళ్లీ కలిశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా అప్పటి ఉపాధ్యాయులకు పాదపూజ చేసి సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. - కాశీబుగ్గ